


**దోచుకోవడానికే అమరావతి ప్లాన్**

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -327 గురువారం 2 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం



- సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- వైకాపా సభ్యుల వాకౌట్



**న్యూఢిల్లీ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. మిగతా 2లో.

## అమరావతి ఇక ప్రజారాజధాని..

**ఇంచుకూడా కదలించలేరు**

**వింజమూరు పర్యటనలో సిఎం చంద్రబాబు**



**నెల్లూరు, ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):** నా జీవితంలో వైసీపీ లాంటి పార్టీని, జగన్ లాంటి వ్యక్తిని చూడలేదు’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆనందించారని మండిపడ్డారు. అమరావతి తీర్మానం రోజున వైసీపీ సభ్యులు అసెంబ్లీకి రాలేదన్నారు. అమరావతి ఏకైక ప్రజా రాజధాని అని... ఇక ఇంచు కూడా ఎవ్వరూ కదిలించలేరని స్పష్టం చేశారు. సిఎం వింజమూరులో సిఎం పర్యటించారు. వింజమూరులో మిగతా 2లో.

## చారిత్రాత్మక ఘట్టం

**ఇది ప్రజా విజయం అంటూ పవన్ కల్యాణ్ ప్రకటన**


**33 వేల ఎకరాలిచ్చిన రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు వెల్లడి**

**ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు హృదయపూర్వక కృతజ్ఞతలు**


2లో.

## నాటో కూటమి నుంచి వైదొలగే యోచనలో అమెరికా... ?

**ట్రంప్ వ్యాఖ్యలు దేనికి సంకేతం?**


2లో.

## కేరళంలో లెఫ్ట్‌కు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే

**కేరళం ఎన్నికల ప్రచారం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్: ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):** “కేరళంలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్)కు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే ..” అవుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఓటర్లను అప్రమత్తం చేశారు. ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని నరేంద్ర మోడీ... తి వేంద్రం కమ్యూనిస్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఓడగొడితేనే కేరళంకు మంచి రోజులు వస్తాయన్నారు. ప్ర ధాని మోడీ-సిఎం విజయన్‌వి విభిన్న భావజాలాలైనా, భా వాలొక్కటేనని, ఎల్డీఎఫ్-బిజెపిల మధ్య ఒప్పందాలు ఉన్నాయని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ గా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళంలోని నేమం సహా పలు నియోజకవర్గాల్లో మిగతా 2లో.

## నేటి నుంచి భూభారతి

**ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో మిగతా 2లో.

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసోంలో పర్యటించిన ప్రధాని మోదీ
- గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరు
- అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా


2లో.

## తెలంగాణలో మీ సేవ కేంద్రాల్లో ఛార్జీల పెంపు..

**నేటి నుంచి అమలు**




**ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రంలో మీసేవ కేంద్రాల్లో అన్ని సేవల ధరలను పెంచారు. ఆయా సర్వీసులపై ధరలను 50 శాతం మేర పెంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రుసుంను రూ.80కి పెంచారు. మిగతా 2లో.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

- 25న కొత్త పార్టీని ప్రకటిస్తాం.. ఆ రోజు చేరికలుండవు
- మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మాపోయిస్టులు కూడా చేరతారు
- కేసీఆర్ రావణుడైతే.. మరి శకుని ఎవరో రేవంత్ చెప్పాలి
- సీఎం బీఆర్ఎస్ భుజాన తుపాకీ పెట్టి పొంగులేటిని కాల్చారు: కవిత


2లో.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

**ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం**

**-వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం**


2లో.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# అమరావతి ఇక ప్రజారాజధాని..

మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరుగుతోందని... ఆమోదం పొంది గురువారంరాజ్యసభకు వెళుతుందని సీఎం తెలిపారు. ఒకటో తేదీ వస్తే పేదలే గుర్తొస్తారని.. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 63 లక్షల మందికి ఫించన్లు ఇస్తున్నామన్నారు. ఫించన్లను మొక్కుబడిగా ఇవ్వడం లేదని... గౌరవంగా ఇంటి వద్దే ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించన్లు, తల్లికి వందనం ఇచ్చామని తెలిపారు. స్త్రీశక్తి సూపర్ సక్సెస్ అయిందని.. ఆడబిడ్డలు దర్జాగా ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి వెళుతున్నారని తెలిపారు. 'మా ఆడబిడ్డల కోసం దీపం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పీఎంజీ కనెక్షన్ తీసుకున్నా.. ఏడాదికి రూ.2,465లు సబ్సిడీ ఇస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉదయగిరికి కూడా నీరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'నాపై కోపంతో పోలవరం ప్రాజెక్ట్‌ను గోదావరిలో కలిపేశారు. గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తాం. శ్రీశైలం, పోలవరంతో ఉదయగిరి ప్రాంతానికి నీటి కొరత ఉండదు' అని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెరగడం లేదని.. అందుకే ఖ4 ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

----------------

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన అందిస్తాం

**ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

శ్రీరాముడి ఆశీస్సులతో, ఆయన చూపిన మార్గంలో ధర్మాన్ని అనుసరించి రాష్ట్రంలో ధర్మబద్ధమైన పాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాముడి పేరు వినగానే సుపరిపాలన, రామరాజ్యం గుర్తుకు వస్తాయని, అదే స్ఫూర్తితో తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఆయన తన అర్ధాంగి భువనేశ్వరితో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

అంతకుముందు, ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు టీటీడీ అధికారులు, పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ నయనానందకరమైన కల్యాణ వేడుకను వేలాది మంది భక్తులు కనులారా వీక్షించారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రిని ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా 'జై శ్రీరామ్' నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంపద, ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని శ్రీరాముడిని ప్రార్థించినట్లు తెలిపారు. "రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్ట ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసి, ఏటా బ్రహ్మోత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ రోజు మనకు ఎంతో పవిత్రమైనది" అని అన్నారు.

ఇదే రోజు లోక్‌సభలో అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. "పూర్వం దేవేంద్రుడు పాలించిన రాజధాని అమరావతి అయితే, నేడు మనం నిర్మిస్తున్నది ప్రజారాజధాని అమరావతి. శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని పాటించి మీకు అండగా ఉంటాం. రామరాజ్యంలాగే మీకు సుపరిపాలన అందిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు.

## నాటో నుంచి వైదొలగే యోచనలో అమెరికా... ?

**ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నాటో సైనిక కూటమిపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాటో ఒక 'కాగితపు పులి' అని అభివర్ణిస్తూ, కూటమి నుంచి వైదొలగే విషయం పునఃపరిశీలన స్థాయి కూడా దాటిపోయింది అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో సైనిక ఘర్షణ విషయంలో యూరప్ మిత్రదేశాలు మద్దతు ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇరాన్‌తో యుద్ధం, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు నాటో దేశాలు ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. ఈ విషయంలో మిత్రదేశాలు 'పిరికిపందలు' అంటూ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఘాటుగా పోస్ట్ చేశారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, నాటో నుంచి వైదొలగడం గురించి మాట్లాడుతూ, "అవును, ఈ విషయం గురించి ఇక ఆలోచించడానికేమీ లేదు. నేను నాటోను ఎప్పుడూ కాగితపు పులిగానే చూశాను, ఈ విషయం పుతిన్‌కు కూడా తెలుసు" అని స్పష్టం చేశారు."మేం ఉక్రెయిన్ విషయంలో వారికి (నాటో దేశాలకు) అండగా నిలిచాం. కానీ ఇరాన్ విషయంలో వారు మాకు మద్దతుగా నిలవలేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన అభిప్రాయానికి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా మద్దతు తెలిపారు. "మనకు అవసరమైనప్పుడు సైనిక స్థావరాలను నిరాకరించే మిత్రదేశాలతో కూటమి వల్ల ప్రయోజనం ఏమిటి?" అని ప్రశ్నించారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ సైనిక స్థావరాలను, గగనతలాన్ని ఉపయోగించుకోవడానికి అమెరికాకు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే.

మిత్రదేశాల వైఖరితో 77 ఏళ్ల నాటి నాటో కూటమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఈ పరిణామాలపై ఇరాన్ విషయంలో బుధవారం రాత్రి ట్రంప్ జాతినుద్దేశించి ప్రసంగించనున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. దీంతో ఆయన ఏం మాట్లాడతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

**దిబ్రుగఢ్ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు.అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

# చారిత్రాత్మక ఘట్టం

**అమరావతిఏప్రిల్1( జర్నలిస్ట్ జర్నీ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత త్యాగాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. "తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000 ఎకరాలకు పైగా భూములను రాజధాని కోసం త్యాగం చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవరూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణలో మీ సేవ కేంద్రాల్లో ఛార్జీల పెంపు..

మొదటిపేజీ తరువాయి

జనన ధృవీకరణ పత్రం రుసుం రూ.62 చేశారు. కేటగిరీ 'ఏ' మరియు కేటగిరీ 'బి' కింద వచ్చే దాదాపు అన్ని సేవలపై కూడా ధరలను పెంచింది.

ఇప్పటి వరకు 'ఏ' కేటగిరీ కింద కనీస ఛార్జీ రూ.35 ఉండగా, దానిని రూ.35కు పెంచారు. ఇందులో అడంగల్, పహాణీ వంటి తక్షణ సేవలు ఉంటాయి. కేటగిరీ 'బీ' సర్వీసుల ఛార్జీని రూ.80కి పెంచారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ప్రాసెస్ అయ్యే కుల, ఆదాయ ధృవీకరణ వంటి సేవల ధరలు రూ.80కి పెరిగాయి. ఇవి నేటి నుంచి అమల్లోకి వచ్చాయి.

మీ సేవ కేంద్రాల నిర్వహణ ఖర్చు పెరిగినందువల్ల ధరలను పెంచాలని నిర్వాహకులు కోరారు. ఈ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ధరల సవరణ చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల ధరల పెంపు చోటుచేసుకుంది.

# నేటి నుంచి భూభారతి

మొదటిపేజీ తరువాయి

భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

------------------

# కేరళంలో లెఫ్ట్‌కు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే ..

మొదటిపేజీ తరువాయి

బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని సభల్లోనూ ముఖ్యమంత్రి ప్రసంగాలకు భారీ స్పందన లభించింది. నేమం నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి కేఎస్ శబరీనాథన్ తరఫున పూంథురలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి, ఆ ర్ఎస్ఎస్‌ను కేరళలోకి రానీయకుండా లక్ష్మణ రేఖ గీసింది యూడీఎఫ్ అని అన్నారు. కేరళలో జాతీయ రహదారులు సహా పలు అభివృద్ధి పనులు నిలిచిపోయినా ముఖ్యమంత్రి పినరయి విజయన్ నోరుమెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కేరళ ప్రజలు బిజెపి-ఎల్‌డిఎఫ్‌కు గుణపాఠం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కేరళ భవిష్యత్తును దెబ్బతీయాలని చూస్తున్నారని సీఎం విమర్శించారు. బిజెపి-సిపిఎం మధ్య సైలెంట్ అండర్స్టాండింగ్ ఉందని అన్నారు. అందుకే వారిపై ఎటువంటి కేసులు ఉండవని విమర్శించారు. దేశంలో ఎవరినైనా బిజెపి ప్రభుత్వం ఈడీ, సీబీఐతో వేధిస్తారని కానీ, విజయన్ సర్కారుపై ఈగ కూడా వాలనీయరని ఆగ్రహించారు. బిజెపి, ఎల్‌డిఎఫ్ బయటకు పోటీ పడుతున్నట్టు కనిపించినా, అది అవాస్తవమని, నటనేని ఆయన విమర్శించారు.

కేరళం సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యం కేరళ సమగ్రాభివృద్ధి యుడీఎఫ్ లక్షమని ఆయన తెలిపారు. విద్యావంతులైన ఎందరో మలయాళీలు స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని.. వారికి స్థానికంగా ఉపాధి కల్పించే పరిశ్రమలు తగిన సంఖ్యలో లేవన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు కేరళం సమగ్రాభివృద్ధికి యూడీఎఫ్ ప్రణాళికలు రచిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందని రేవంత్ పిలుపునిచ్చారు. హస్తం పార్టీకి ఓటేస్తే పాత కేరళం ఏమిటో మళ్లీ చూపిస్తామని హామీ ఇచ్చారు. డెవలప్మెంట్ విత్ డిగ్నిటీతో ముందుకు వెళుతున్నామని సీఎం తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ సిఎంల నిష్కళంక రాజకీయాలు... సామాజిక ప్రగతి, అభివృద్ధి, అక్షరాస్యతలో కేరళం ఎప్పటినుంచో యావత్ దేశానికే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని, అందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన కృషే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగంలో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాధించిన ప్రగతిని సీఎం వివరించారు. దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా కేరళంకు ఉన్న గుర్తింపును రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. విద్యా, అవగాహన, సామాజిక చైతన్యంలో కేరళం దేశానికి అప్పటికీ, ఇప్పటికీ నమూనాగా ఉందని సీఎం తెలిపారు. ఇందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీ, ఏకే ఆంటోనీల కృషి ప్రధాన కారణమన్నారు.

వాళ్లు కేరళంకు సమగ్ర, సమ్మిళిత, సమతుల్య, నిష్కళంక రాజకీయాలను అందించారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. కరుణాకరన్ కేరళలో అభివృద్ధికి బాటలు వేశారని, ఊమెన్ చాందీ సంక్షేమం-అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చారని, ఏకే. ఆంటోనీ నిజాయితీకి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలనలో కేరళంకు గౌరవం, నమ్మకం, పరిపాలనా స్థిరత్వం వచ్చిందన్నారు. కేరళంను గాడ్స్ ఓన్ కంట్రీ గా పిలుస్తారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే, దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా కేరళం ఒక బ్రాండ్‌గా నిలిచిందన్నారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం, సామాజిక పురోగతి- ఇవన్నీ కేరళంను ఒక ప్రత్యేక రాష్ట్రంగా నిలబెట్టాయన్నారు. అక్కడా.. ఇక్కడా వైఫ్యలం.. గత 12 ఏళ్ళుగా ఢిల్లీలో, 10 ఏళ్ళుగా కేరళంలో పరిస్థితులు పూర్తిగా దిగజారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోడీ, కేరళంలో విజయన్ డబుల్ ఫెయిల్యూర్‌గా నిలిచారని సీఎం విమర్శించారు. ఢిల్లీలో మోడీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం, తిరువనంతపురంలో విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ సర్కారులో దేశం, రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లాయని విమర్శించారు. వీరి ఇరువురి సిద్ధాంతాలు వేరు అయినా... వైఫల్యాలు మాత్రం ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. నిరుద్యోగంతో ఇక్కడి యువత ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. తెలంగాణ బాటలో కేరళం.. సోనియా గాంధీ దత్తత తీసుకున్న తెలంగాణ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని.. కేరళం కూడా అలానే ముందుకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళం అభివృద్ధికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కేరళం కుటుంబ సభ్యుల్లా మారారని సీఎం తెలిపారు. విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో.... మలయాళీ సూపర్ స్టార్ మోహన్లాల్ నరసింహం సినిమాలో చెప్పిన నీ పో మోనే.. దినేశా.. స్టైల్లో నీ పో మోనే విజయన్.. యువర్ టైమ్ ఈజ్ ఓవర్ (విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో) అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. మలయాళంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుకరించడంతో యువత నుంచి భారీ స్పందన లభించింది. యంగ్ సీఎం... డైనమిక్ సీఎం అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

**25న కొత్త పార్టీని ప్రకటిస్తాం.. ఆ రోజు చేరికలుండవు**

**మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మావోయిస్టులు కూడా చేరతారు**

**కేసీఆర్ రావణుడైతే.. మరి శకుని ఎవరో రేవంత్ చెప్పాలి**

**సీఎం బీఆర్ఎస్ భుజాన తుపాకీ పెట్టి పొంగులేటిని కాల్చారు: కవిత**

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

రావణాసురుడు ఉండటం వల్లే రాముడికి, శకుని ఉండటం వల్లే కృష్ణుడికి గుర్తింపు దక్కిందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికరంగా స్పందించారు. కేసీఆర్‌ను రావణుడిగా చెప్పిన రేవంత్, శకుని ఎవరో మాత్రం చెప్పలేదని పేర్కొన్నారు. జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనను తాను మహాభారతంలోని బర్బరీకుడి పాత్రతో రేవంత్ పోల్చుకున్నారని, ఇది తనకు నవ్వు తెప్పిస్తోందని, బర్బరీకుడి మాదిరిగా రేవంత్ చేసిన త్యాగం ఏమిటో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఈనెల 25న కొత్త పార్టీ ప్రకటన ఉంటుందని చెప్పారు. పార్టీ ఎజెండా, ప్రజలకు ఏం చేయదల్చుకున్నామో అదేరోజు వివరిస్తామని చెప్పారు. ఆ రోజు పార్టీలో చేరికలు ఉండవని పేర్కొన్నారు. ఇప్పటికే బీఅర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారన్నారని.. వారి పేర్లు సమయం వచ్చినప్పుడు తానే వెల్లడిస్తానని చెప్పారు. మాజీ మావోయిస్టులు కూడా పార్టీలోకొచ్చి సేవలందిస్తారని పేర్కొన్నారు. కొత్తపార్టీ ప్రకటనకు ముందు ఉమాభారతి లాంటి కొందరు జాతీయస్థాయి నేతలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటానని వెల్లడించారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాలు తిట్టుకోవడానికే సమయం సరిపోయిందని, ఒకరి అవినీతిని మరొకరు బయట పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ బీఆర్ఎస్ పార్టీ భుజాన తూపాకీ పెట్టి మంత్రి పొంగులేటి శ్రీనివావీసరెడ్డిని కాల్చారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరగనుందని, ఆ మేరకు మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాటం చేస్తామని చెప్పారు. కల్వకుర్తి పరిధిలోని కుర్మిద్దలో ప్రభుత్వం పెద్ద భూస్వాములకు చెందిన వందల ఎకరాల భూములను వదిలిపెట్టి.. ఎకరం, అర ఎకరం ఉన్న పేద గిరిజనుల భూములు టీజీఐసీసీ ద్వారా లాక్కునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

దీన్ని అడ్డుకునేందుకు బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని కవిత వెల్లడించారు. కాగా ప్రభుత్వం జారీచేసిన జీవో (నెంబరు 4) ప్రకారం గ్రూప్ -1 తరహాలో డిగ్రీ కళాశాల లెక్చరర్ పోస్టులను తమవారికి కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పీహెచ్డీ చేసిన వారికి 25 మార్కుల వెయిటేజీ, ఇంటర్వ్యూలో పది మార్కులంటూ నిబంధనలను తమ వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారని విమర్శించారు. వెంటనే జీవో 4ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి జీవో 104, గ్రూప్స్‌కోసం జీవో 29, పోలీసు ఉద్యోగాలకు జీవో 46, గురుకులాలకు జీవో 81 తెచ్చారని, ఇలా ఉద్యోగ నియామకాలకు అడ్డంకిగా ఉన్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందని విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వం ఏరివేత కార్యక్రమం ద్వారా 15 లక్షల రేషన్ కార్డులు తీసేయాలని చూస్తోందని ఆరోపించారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేశారని, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారనే కారణంతో రేషన్ కార్డులు ఏరివేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

## ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం -వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ది చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టా÷-గ్గ÷ట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

## వివాహ వేడుకలో పాల్గొన్న సింగారం సర్పంచ్ సరస్వతి రాందాస్ నాయక్.



**బయ్యారం/,ఏప్రిల్ 1.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం సింగారం గ్రామంలో జరిగిన పెళ్ళిలో సర్పంచ్ సపవత్ సరస్వతీ రాందాస్ నాయక్,ఉప సర్పంచ్ చుంచు కాశి, గుగులోతు భద్రు,గుగులోతు వెంకటేష్ ,సపవట్ సంతోష్,మాజీ ఎంపీటీసీ చేరుకుపల్లి రాములు,నగేష్, బాలరాజు,అనిల్, బాబురావు, వల్య,గోపి,సురేష్, ఆమర్సింగ్,స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు.

## బైబిల్ బోధనలతో ఆధ్యాత్మిక చైతన్యం



**తల్లాడ/ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని క్రీస్తు సంఘంలో బైబిల్ క్లాసులు నిర్వహిస్తూ విశ్వాసుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందిస్తున్నారు. బ్రదర్ ఇశ్రాయేలు సారథ్యంలో జరుగుతున్న ఈ తరగతుల్లో దైవ సేవకుడు చంటిబాబు బైబిల్ బోధనలు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని వాక్యాన్ని కేవలం వినడమే కాకుండా, దాన్ని ఆచరణలో పెట్టాలని విశ్వాసులకు సూచించారు. భయభక్తులతో జీవిస్తూ, బైబిల్‌లోని సత్యాలను ప్రతి ఒక్కరూ తమ తమ సంఘాల్లో పంచాలని పిలుపునిచ్చారు.ఈ క్లాసులు విశ్వాసులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పాల్గొన్న వారు తెలిపారు. దైవ సేవకుల సేవాభావాన్ని అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవసహాయం, రమణ, కృష్ణయ్య, ఇశ్రాయేలు, రవి, సూర్యం, నారపోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వేంసూరులో భవన నిర్మాణ కార్మికుల నిరసన



**వేంసూరు/ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలో సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మికులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన “బ్లాక్ డే”లో భాగంగా కార్మికులు తమ అడ్డా నుండి ప్రధాన రహదారి వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో తిప్పిశెట్టి సత్యనారాయణ, పండు, సూరిశెట్టి వెంకటేశ్వరరావు, సారంగుల మల్లేశ్వరరావు, బజ్జూరి చెన్నారావు, రంజాన్, నాగుల మీరా తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

### తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**
ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.



## ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు.





**బయ్యారం/,ఏప్రిల్ 1.(జర్నలిస్ట్ వార్త)**
మండలంలో దిశ దశ నిర్దేశం చేసే బయ్యారం ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్ట్ నాయిని ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలను వారి శ్రేయోభిలాషులు,బంధుమిత్రులు తుమ్మల శ్రీనివాస్ ఇంటి ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. జన్మదిన వేడుకల సందర్భంగా ఆయురారోగ్యాలతో మండలానికి దిశా నిర్దేశం చేస్తూ మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని మిత్రులు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో నీలారపు సంపత్ యాదవ్, నరేష్,ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన సింగపురం ఇమ్మానియేల్ రాజ్



**స్టేషన్ ఘన్పూర్/ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త);**స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ సీనియర్ నాయ కులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి హైదరాబాద్‌లోని అస్తర్ ప్రైమ్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సింగపురం ఇందిర కుమారుడు యువ నాయకులు సింగపురం ఇమ్మాని యేల్ రాజ్ స్టేషన్ ఘనపూర్ లోని వారి నివాసానికి వెళ్లి నరేందర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నరేందర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వద్లూరి మౌనిక, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, సింగపురం నాగయ్య, నియోజక వర్గ సీనియర్ నాయకురాలు నారగోని పద్మ, జిల్లా బీసీ సెల్ నాయకులు తాటికొండ సంపత్ కుమార్ ,చింత ఎల్లయ్య,మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య ,కలకొల్లు బాలరాజు చిల్పూరు మండ ల యూత్ వైస్ ప్రెసిడెంట్ చాగంటి మణి , నాయ కులు బట్టమేకల శివరాజ్ , కర్రెల్లి రాజ్ కుమార్ , వెంకటేశ్వర్లపల్లి ఉపసర్పంచ్ రజినీకర్రెడ్డి, జాఫ ర్ఖద్ సీనియర్ నాయకులు డేవిడ్ బాబు గారు, నారగోని సరిత గారు తదితరులు పాల్గొన్నారు.,

## ఎమ్మెస్సార్ కన్స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలి: తోట నాగేశ్వరరావు





**తల్లాడ/ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఎమ్మెస్సార్ కన్స్ట్రక్షన్స్ క్రషర్ కార్యకలాపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక రైతు తోట నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాలాపేట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 116/117లో తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్న సమయంలో క్రషర్ యాజమాన్యం నిర్లక్ష్యంగా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ పంట పొలాలు, చెట్లు, పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నట్లు ఆరోపించారు.ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఎప్పుడైతే అప్పుడు బాంబులు పెట్టి బ్లాస్టింగ్ చేయడం వల్ల సమీపంలోని రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. రోజువారీ వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా జరిగిన బ్లాస్టింగ్‌లో రాళ్లు ఎగిరి తన చేతికి తగిలి గాయాలయ్యాయని నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, క్రషర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. రైతుల జీవనాధారమైన వ్యవసాయ భూములను రక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని వారు వాపోయారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి.



**బయ్యారం/,ఏప్రిల్ 1.(జర్నలిస్ట్ వార్త)**
కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుండి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని తీసుకువచ్చిన సర్క్యులర్ ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా నాలుగు లేబర్ కోర్సు రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిరసిస్తూ బుధవారం జాతీయ రాష్ట్రీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం బయ్యారంలో మెయిన్ రోడ్డుపై మండల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టియుసిఐ రాష్ట్ర నాయకులు బిళ్ళ కంటి సూర్యం ఐఎఫ్ టీయు రాష్ట్ర కార్యదర్శి ఎస్కె.మదర్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో కార్మికులు సాధించుకున్న చట్టాలను నేడు మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి బుధవారం వాటి అమలుకు పూనుకోవడం చాలా దుర్మార్గమన్నారు.దేశంలో 44 కోట్ల మంది సంఘటిత అసంఘటిత కార్మికులు ఉన్నారని వారికి ఎటువంటి హక్కులు లేవన్నారు.నేడు దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్లు తీసుకువచ్చి కార్మికులను కార్పొరేట్ శక్తులకు కట్టు బానిసలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్స్ వలన కార్మికునికి తన హక్కును సాధించుకునే అధికారాన్ని కోల్పోతాడని కనీసం తన సమస్యపై ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకునే స్థితిని కోల్పోతాడని యజమాన్యానికి ఎదురు తిరగకుండా కట్టు బానిసలుగా పని చేసే విధానానికి నిదర్శనమే లేబర్ కోడ్లని అన్నారు.కార్మికులు అనేక సంవత్సరాలుగా కొట్లాడి సాధించుకున్న హక్కులను అలానే ఉంచి నేడు తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.మోడీ ప్రభుత్వం తీసుకొచ్చే నాలుగు కోడ్లకు వ్యతిరేకంగా ఉద్యమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా కోశాధికారి పూజల లచ్చయ్య,భక్తుల ధనంజయ,గుర్రం పూర్ణ,జల్లి వెంకన్న, ఎస్కే.జానీ, సిఐటియు నాయకులు రాయబారపు,అప్పయ్య,రాము,అర్జున్ తదితరులు పాల్గొన్నారు

## పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

### నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడ్ల వెంకటయ్య



**.స్టేషన్ ఘన్పూర్/ ఏప్రిల్ 1, (జర్నలిస్ట్ వార్త):**
స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధి కార పార్టీ ప్రతినిధి ఎడ్ల వెంకటస్వామి మాట్లా డుతూ కౌశిక్ రెడ్డినీ గతం మర్చిపోయి మాట్లాడ కు,పాడి కౌశిక్ రెడ్డి నాకు ఓటు వేసి గెలిపించకపో తే నేను నా భార్య పిల్లలను చనిపోతామని బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడి గెలిచిన నీవు, 30 మార్చి 2026పాడి కౌశిక్ రెడ్డి దగ్గర పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని అన్నారు.సీనియర్ నాయకుడైన కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్య లు తగదని, నాలుగు సార్లు మంత్రి పదవులు చేసి మచ్చలేని నాయకుడిగా కడియం శ్రీహరికి పేరు ఉందని అసెంబ్లీ సాక్షిగా గన్నుతో కాల్ చేస్తానని బెదిరిం పులకు పాల్పడుతున్న కౌశిక్ రెడ్డి,అసెంబ్లీ సాక్షిగా క్షమాపణ చెప్పాలని నీ దిష్టిబొమ్మలు తగలబెట్ట డంతో ఆగదని,ధర్నాలు రాస్తారోకోలు కూడా చేస్తామని హెచ్చరించిన దిగజారుడు మాట్లాడు తున్న దిగుతున్న బిఆర్ఎస్ నాయ కులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## ముప్పారం శివారులో కారు ఢీకొని ఇద్దరి మృతి





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త)**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం శివారులో బుధవారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు ఘటన స్థలంలోనే మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసుల సమాచారం మేరకు, ప్రమాదానికి గురైనవారు జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్ గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. మృతులు ఏనుగుల శివ, లోకేష్‌లుగా నిర్ధారించారు. వీరిద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారనే విషయం స్థానికులను మరింత విషాదంలో ముంచింది.గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ ఘటనతో నర్సాపూర్ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# నూతన గృహ ప్రవేశాన్ని ప్రారంభించిన సింగపురం ఇమ్మానియేల్





**స్టేషన్ ఘన్పూర్/ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త)**

స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కుల రాజయ్య – లక్ష్మి దంపతుల కుమారుడు జక్కుల రాజశేఖర్ సుష్మ నూతన గృహప్రవేశానికి స్టేషన్ ఘనపూర్ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా తనయుడు యువ నాయకులు లిసింగపురం ఇమ్మానియేల్ రాజ్ విచ్చేసి నూతన గృహంలో అడుగుపెట్టిన రాజశేఖర్ సుష్మ దంపతులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియ జేస్తూ, ఈ సందర్భంగా సింగపురం ఇమ్మానియేల్ వారిని అభినందించారు. ఆ భగవంతుని కృపతో తన గృహం వారికి సకల సుఖశాంతులను, ఆయురారోగ్యాలనుప్రసాదించాలని మనస్పూర్తిగా వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక గారు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సింగపురం నాగయ్య గారు,నియోజకవర్గ సీనియర్ నాయకురాలు నారగోని పద్మ గారు, జిల్లా బిసి సెల్ నాయకులు తాటికొండ సంపత్ కుమార్ గారు, కలకొల్లు బాలరాజు,చిల్పురు మండల ఇంచార్జ్ తీగాల మహేందర్ , చిల్పురు దేవస్థానం మాజీ డైరెక్టర్ ఉప్పర గణేష్ గమండల యూత్ వైస్ ప్రెసిడెంట్ చాగంటి మణీ, నాయకు లు బట్టమేకల శివరాజ్ ,కర్రెల్లి రాజ్ కుమార్ వెంకటేశ్వరపల్లి ఉప సర్పంచ్ రజినీకర్ రెడ్డి పులి రాజ్ కుమార్ ,వెంకటేశ్వరపల్లి ఉపాధ్యక్షులు తోకల రాజిరెడ్డి ,జాఫర్ఖడ్ సీనియర్ నాయకులు దేవిడ్ బాబు ,నారగోని సరిత తదితరులు పాల్గొ న్నారు.

# మంగళ తోరణాలతో ప్రారంభమైన అంకమ్మ జాతర





**తల్లాడ/ఏప్రిల్ 1( జర్నలిస్ట్ వార్త):**

మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఐదు రోజులపాటు జరగనున్న అంకమ్మ జాతర బుధవారం ఉదయం మంగళ తోరణాలతో, విఘ్నేశ్వర పూజలతో వైభవంగా ప్రారంభమైంది. గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది.

ఈ సందర్భంగా తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ పాల్గొని తోరణపాకులు కట్టి దేవాలయాన్ని అలంకరించారు. అనంతరం జాతర కమిటీ సభ్యులతో మాట్లాడిన వారు, జాతర కార్యక్రమాలు ఎలాంటి అంతరాయాలు లేకుండా సజావుగా నిర్వహించాలని సూచించారు.రాత్రి జరిగే అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ జాతర జిల్లాలో మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్ దొడ్డ నిర్మల, జాతర కమిటీ సభ్యులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, దొబ్బల శ్రీనివాసరావు, పేరసాని నరసింహారావు, దుగ్గినేని సత్యనారాయణ తదితరులు, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైద్యులపై దాడి సహించేది లేదు

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు: సీఐ శ్రీనివాస్

**నర్సంపేట/ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

నర్సంపేట పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న వైద్యుడిపై దాడి ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేసింది. వివరాల ప్రకారం, ఫిబ్రవరి 19, 2026న వరంగల్ రోడ్డులోని వేద స్కానింగ్ సెంటర్‌కు ములుగు సతీష్ డాక్టర్ రిఫర్ చేసిన ఒక యువతికి స్కానింగ్ నిర్వహించి రిపోర్టు అందజేశారు. అయితే ఆ రిపోర్టు తప్పుగా ఇచ్చారని ఆరోపిస్తూ, మార్చి 22, 2026న ఆ యువతి కుటుంబ సభ్యులు నలుగురు కలిసి స్కానింగ్ సెంటర్‌కు చేరుకొని, అక్కడ విధుల్లో ఉన్న రేడియాలజిస్ట్ డాక్టర్ సతీష్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రధాన నిందితుడు మోడెం విద్యాసాగర్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ,వైద్యులపై దాడులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరైనా తమ చేతుల్లోకి తీసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సై రవికుమార్ తదితర పోలీసులు పాల్గొన్నారు. ఇక నర్సంపేట ఐఎంఏ డాక్టర్లు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. వైద్య సంబంధిత విషయాలపై సరైన అవగాహన లేకుండా వైద్యుడిపై దాడి చేయడం అమానుషమని వారు పేర్కొన్నారు. వైద్యుల భద్రతకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.




# దోచుకోవడానికే అమరావతి ప్లాన్

### రాష్ట్రానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు

### కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం

### మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్

**అమరావతి ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్ధాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారధి




చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు.

# ధర్మసాగర్‌లో విడుదలైన దళిత హక్కుల పోరాట సమితి మహాసభల పోస్టర్




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):**

దళిత హక్కుల సాధన కోసం కట్టుబడి ఉన్న దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ, ధర్మసాగర్ మండలంలో బుధవారం ఘనంగా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మహాసభలు వరంగల్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్, పోచమ్మ మైదానం వద్ద ఏప్రిల్ 17, 18 తేదీలలో నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాచారపు రత్నం మాట్లాడుతూ, దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం ఈ మహాసభలు కీలకమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించే వేదికగా ఈ సభలు నిలవనున్నాయని పేర్కొన్నారు.హనుమకొండ జిల్లాలోని ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమైక్యంగా పోరాడితేనే దళితులకు న్యాయం సాధ్యమవుతుందని, ఈ మహాసభలు ఉద్యమానికి కొత్త దిశానిర్దేశం చేస్తాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు రొంటాల దేవా, మేకల శంకర్, రాజారపు దేవయ్య, బట్టు మల్లయ్య, చిలక బాబు, వల్లెపు వెంకన్న, ప్రవీణ్, రాజారపు శ్రీను, చిలుక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సర్పంచ్‌పై కులం పేరుతో దూషణ


## నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు



**గీసుగొండ/ఏప్రిల్1(జర్నలిస్ట్ వార్త);** మహిళా సర్పంచ్‌ను కులం పేరుతో దూషించడంతో పాటు, గ్రామ పంచాయతీ సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై గీసుగొండ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. ఎలుకుర్తి గ్రామానికి చెందిన మంద రమ (గ్రామ పంచాయతీ సిబ్బంది) తన సహచరురాలు పులి సునీతతో కలిసి బుధవారం గ్రామ పంచాయతీ నర్సరీ పనుల నిమిత్తం వెళ్తున్నారు. అదే గ్రామానికి చెందిన దుమాల రాజు మద్యం మత్తులో వారిని వెంబడించి, అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధించాడు. బాధితురాలు ప్రాణభయంతో నర్సరీ వద్దకు వెళ్లగా, అక్కడే ఉన్న గ్రామ సర్పంచ్ దివ్యభారతి, ఆమె భర్త రమేష్ జోక్యం చేసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న రాజుకు సర్పంచ్ నచ్చజెప్పే ప్రయత్నం చేయగా, అతను మరింత రెచ్చిపోయాడు. సర్పంచ్ దివ్యభారతిని కులం పేరుతో దూషిస్తూ, అసభ్యకరంగా తిడుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితురాలు మంద రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు నిందితుడు దుమాల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి

# గోపిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు





**తల్లాడ/ ఏప్రిల్ 1 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం తల్లాడ మండల యువ నాయకుడు బి రెడ్డి గోపిరెడ్డికు చరవాణి ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ప్రజాసేవ చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.అనంతరం తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో గోపిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రథమ పౌరురాలు సర్పంచ్ కోడూరి ఉమా వీరకృష్ణ దంపతులు, ఉపసర్పంచ్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మండల ప్రజలు భారీగా పాల్గొన్నారు.కేక్ కటింగ్, మిఠాయిల పంపిణీ, చాక్లెట్లు, బాణసంచా వంటి కార్యక్రమాలతో వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా నాయకులు గోపిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి బిల్లుపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు నారపోగు ప్రసాద్, వేముల గోవిందు, రవికుమార్, శ్రీను, చల్లా నాగులు, బొడ్డు శ్రీను, వెంకట్రావు, తిరుపతి మాదిగ, దేవ, రాజశేఖర్, సురేందర్, అశోక్, ఎంఆర్పీఎస్ లక్ష్మణ్, సింహాద్రి (నందమూరి అభిమానులు) తదితరులు పాల్గొన్నారు.

## 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.






## విశ్రాంతి కోసం విదేశాలకు ప్రభాస్

టాలీవుడ్ డార్లింగ్, పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ వరుస షూటింగ్‌ల నుంచి చిన్న విరామం తీసుకున్నారు. ప్రభాస్ తన తదుపరి చిత్రాలపై మరింత జాగ్రత్తగా, పూర్తి ఫోకస్‌తో పని చేస్తున్నారు. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న డార్లింగ్, కొద్ది రోజులు విశ్రాంతి అవ్వడానికి వెకేషన్‌కు రెడీ అయ్యారు. నిర్విరామంగా షూటింగ్స్‌లో పాల్గొంటున్న ఈ పాన్ ఇండియా స్టార్, వేసవి సెలవుల కోసం ఇటలీకి బయలుదేరారు. తాజాగా బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఇటలీకి పయనమయ్యారు. అక్కడ కొద్ది రోజులు ప్రశాంతంగా గడిపిన తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. విరామం తర్వాత ఆయన నేరుగా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో బాక్సాఫీస్‌ను షేక్ చేసే రేంజ్‌లో ఉన్న సినిమాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫౌజీ అందులో ఒకటి. ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్న చిత్రం స్పిరిట్. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కల్కి సీక్వెల్ షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, ప్రభాస్ వెకేషన్ నుంచి రాగానే కీలక షెడ్యూల్స్ ప్రారంభం కానున్నాయని టాక్. బాక్సాఫీస్ వద్ద 'రాజా సాబ్' ఫలితం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినప్పటికీ, రాబోయే సినిమాల లైనప్ చూస్తుంటే డార్లింగ్ మళ్లీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

### మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి



టాలీవుడ్ హీరో ఎన్టీఆర్- కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.

----------------

## తెలంగాణ నేపథ్య కథతో సుకుమార్ నిర్మాణంలో సినిమా



గత కొంతకాలంగా తెలుగు సినిమాల్లో తెలంగాణ నేపథ్య కథలను తరచుగా చూస్తున్నాం. తెలంగాణ మట్టికథలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రధాన కథావస్తువుగా తీసుకుని దర్శకులు భావోద్వేగ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 'బలగం' ఈ కోవలోనే ఎలాంటి విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆ చిత్రాన్ని తెలంగాణలోని ప్రతి పల్లెలో తెరలు కట్టుకుని చూస్తూ ఎమోషనల్ అయ్యారు. 'బలగం' తరువాత తెలంగాణ నేపథ్య కథలతో సినిమాలు తెరకెక్కించడానికి దర్శక, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఇక త్వరలో మరో తెలంగాణ నేపథ్య కథతో సినిమా సెట్స్ మీదకు వెళ్లడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ తన సొంత నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ సంస్థపై చిత్రాలు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సుకుమార్ రైటింగ్స్ సంస్థ నాగచైతన్య హీరోగా నటిస్తున్న వృషకర్మ, రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రాలకు నిర్మాణ భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా సుకుమార్, నిర్మాత బన్నీవాస్‌లు సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారు. 'బలగం' ఫేమ్ ప్రియదర్శి హీరోగా నటించనున్న ఈ చిత్రం తెలంగాణ నేపథ్య కథతో రూపొందనుందని సమాచారం. ఈ చిత్రం ద్వారా ఓ నూతన దర్శకుడు పరిచయం కాబోతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. దర్శకుడిగా స్టార్స్‌తో పాన్ ఇండియా చిత్రాలు తెరకెక్కిస్తున్న దర్శకుడు సుకుమార్, నిర్మాతగా కూడా ఇలాంటి కథలతో చిన్న సినిమాలు నిర్మించడం నిజంగా ప్రశంసనీయం.



## సక్సెస్ అయితేనే కృతిశెట్టికి కలిసొచ్చేది!

కృతి శెట్టి టాలీవుడ్ ..కోలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందం, అభినయం, ట్యాలెంట్ ఉన్నా?టాలీవుడ్ లో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో కోలీవుడ్ లో కూడా అదృష్టాన్నిపరీక్షించుకుంది. అక్కడా అదే పరిస్థితి. కాకపోతే? తెలుగు కంటే తమిళ్ లో మెరుగ్గా కనిపిస్తోంది. సినిమా ఫ్లాప్ అయినా మరో ఛన్గ్స అందుకోగల్గుతుంది. అక్కడైనా ఇలా ఎంత కాలం? దీంతో అమ్మడి కెరీర్ హిట్ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో కృతి శెట్టి ఆశలన్నీ తాజా చిత్రం -లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ- పైనే ఉన్నాయి. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకె క్కుతోన్న ఈ సినిమాపై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ మంచి అంచనాలు ఉన్నాయి

ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి బజ్ ఏర్పడింది. లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా గెస్ట్ రోల్ పోషించడం సినిమాకు కీలకంగా మారింది. ప్రత్యేకించి కృతి శెట్టికి తమిళంలో పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుందని ఎంతో ధీమాతో ఉంది. ఈ విషయంలో మేకర్స్ కూడా అంతే కాన్ఫిడెంట్ గా ఉన్నారు. -లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ- సూపర్ హిట్ అయితే కృతి గ్రాఫ్ మళ్లీ ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. సినిమా గనుక ఆశించిన స్థాయిలో ఆడకపోతే? కృతి శెట్టి కెరీర్ మరిన్ని ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొత్త కథానాయికల నుంచి పోటీ పెరగడం, పాన్-ఇండియా సినిమాల ట్రెండ్ నడుస్తుండటంతో, పాత ఫామ్‌ను అందుకోవడం అమ్మడికి సవాలుగా మారింది. తమిళంలో విజయం సాధిస్తేనే తెలుగు మేకర్స్ ఆమె వైపు మళ్లీ చూసే పరిస్థితి కనిపిస్తోంది.

## నాకు వయసుతో పాటే బైకులపై ఆసక్తి పెరుగుతూ వచ్చింది: రాజశేఖర్



సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్, తన భార్య జీవిత గురించి ఓ సరదా విషయాన్ని మీడియా ముందు పంచుకున్నారు. తనకు ఎంతో ఇష్టమైన బైక్‌ను, తనకు తెలియకుండానే జీవిత అమ్మేశారని ఆయన నవ్వుతూ చెప్పారు. శర్వానంద్ హీరోగా నటిస్తున్న 'బైకర్' సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా నిన్న హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఈ ఆసక్తికర సంఘటనను ఆయన వెల్లడించారు.

బైక్స్ అంటే తనకెంత ఇష్టమో వివరిస్తూ, చిన్నప్పటి నుంచి తనకు బైక్స్ అంటే చాలా ఇష్టమని, అమ్మమ్మగారింట్లో బుల్లెట్‌పై ఊరంతా తిరిగేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. తనకు వయసుతో పాటు బైకులపై కూడా ఆసక్తి పెరుగుతూ వచ్చిందన్నారు. ఆ క్రమంలోనే శేషు సినిమా సమయంలో షూటింగ్ కోసం తాను స్వయంగా యమహా 650 బైక్‌ను కొనుగోలు చేశానని. ఆ తర్వాత కూడా దాన్నే కొన్నాళ్లు నడిపానని చెప్పారు. అయితే, నేను నడిపే విధానం చూసి జీవిత ఆందోళన చెందిందన్నారు. స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నానని భయపడి తనకు తెలియకుండా జీవిత బైక్ అమ్మేసిందని నవ్వుతూ చెప్పారు.కాగా, ఏప్రిల్ 3న విడుదల కానున్న 'బైకర్' చిత్రంలో రాజశేఖర్ 'బుల్లెట్ సునీల్' అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమాతో పాటు, తాను 'మగాడు' అనే మరో చిత్రంలో నటిస్తున్నానని, అలాగే తన కుమార్తె శివానితో కలిసి ఓ సినిమాలో కనిపించనున్నట్లు రాజశేఖర్ తెలిపారు.